

19న శ్రామిక మహిళా సంఘం జిల్లా సదస్సు

అనంతపురం కలెక్టరేట్ : శ్రామిక మహిళా సంఘం జిల్లా సదస్సు ఈ నెల 19వ తేదీన నగరంలోని రుద్రంపేట బైపాస్ రాయల్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ ఎం.నాగమణి తెలిపారు. మంగళవారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వివిధ రకాల శ్రమల్లో శ్రామిక మహిళల పాత్ర పెరుగుతోందన్నారు. గౌరవవేతనం, సేవా కార్మికులు వంటి అందమైన పేర్లతో తక్కువ వేతనం, భద్రత లేని ఉద్యోగం, నిత్యం వేధింపులు, రిటైర్మెంట్ సదుపాయాలు లేని పనుల్లో శ్రామిక మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హక్కుల సాధనకు కనీస వేతనాలు అమలు కోసం పనిచేసే రంగాల్లో యూనియన్ ఏర్పాటు చేసుకుని పోరాడుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం, భవిష్యత్తు కార్యచరణపై 19వ తేదీన ఉదయం 10 గంటలకు రాయల్‌ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న సదస్సుకు సిఐటియు జాతీయ నాయకురాలు పుణ్యవతి, రాష్ట్ర నాయకురాలు స్వరూపరాణిలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. శ్రామిక మహిళలు పెద్ద ఎత్తున హాజరై సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు రమాదేవి, లక్ష్మీ నరసమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.



పుట్టపర్తి మండలంలోని గంగిరెడ్డిపల్లి రిజర్వ్‌ఫారెస్ట్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్

వేగవంతంగా రహదారుల నిర్మాణ పనులు

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో చేపడుతున్న వివిధ రహదారుల నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ అధికారులను ఆదేశించారు. గురువారం శ్రీసత్యసాయి జిల్లాలోని కొడికొండ నుంచి మేదరమెట్ల వరకు (ఎకనామిక్ కారిడార్) నిర్మిస్తున్న రోడ్డుకు సంబంధించి పనులను జాయింట్ కలెక్టర్ చేతన్‌తో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా పుట్టపర్తి మండలంలోని గంగిరెడ్డిపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌ను పరిశీలించి ఫారెస్ట్ క్లియరెన్స్ కోసం పలు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రహదారుల అభివద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సకాలంలో ఆయా రహదారుల పనులను పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కదిరి బైపాస్ రోడ్డును ఆయన పరిశీలించారు. బైపాస్ రోడ్డు పనులను సకాలంలో పూర్తి చేసేందుకు వేగవంతంగా పనులను చేపట్టాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ అధికారులను ఆదేశించారు. తదనంతరం బత్రేపల్లి క్రాస్ నుంచి కోలేకనుమ (గండి) రోడ్డును పరిశీలించి నాణ్యత విషయమై ఆరా తీశారు. రహదారి పనులను నాణ్యతగా చేపట్టాలని అధికారులను ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశించారు. అంతకు ముందు పెనుకొండ మండలం ఎర్రమంచి గ్రామ రెవెన్యూ పరిధిలో గల ఆర్‌ఓబి భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యలక్ష్మి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ ఓబుల్‌రెడ్డి, జిల్లా ఇంజినీరు సంజీవయ్య, నేషనల్ హైవే ఎస్‌ఈ మురళీమోహన్, నేషనల్ హైవే అధికారులు, కియా ప్రతినిధులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రజా గాయకుడు శేఖర్ మరణం



సిపిఎం ఆధ్వర్యంలో నివాళి



శేఖర్ పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు, (ఇన్‌సెట్‌లో శేఖర్)

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజా గాయకుడు శేఖర్ గురువారం నాడు హఠాత్తుగా మరణించారు. రాజీవ్‌కాలనీ పంచాయతీ, భగత్‌సింగ్ నగర్‌లో నివాసం ఉన్న శేఖర్ ఇంట్లో గుండెపోటుకు గురై అక్కడికక్కడే మరణించారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి తదితరులు శేఖర్ పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేఖర్ మృతి కళారంగానికి తీరనిలోటు అన్నారు. శేఖర్ రైతులు, కార్మికులు, కష్టజీవులు, అణగారిన వర్గాల పక్షాన తన గానంతో చైతన్యం నింపి పోరాట స్ఫూర్తిని పెంపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆశాబీ, ఉప సర్పంచి మసూద్, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు బాబు, వెంకటనారాయణ, సిపిఎం నాయకులు వలీ, ప్రకాష్, ఇస్మాయిల్, డేవిడ్, మాజీ సర్పంచి హుస్సేన్, కెవిపిఎస్ అధ్యక్ష, కార్యదర్శులు జీవరత్నం, వెంకటేష్, రాజా, దేవరాజ్, ప్రజానాట్యమండలి లక్ష్మినారాయణ, గాయకులు, కళాకారులు, కవులు, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ నాయకులు పాల్గొని నివాళి అర్పించారు.

ప్రజాదంత వైద్యశాల ఆధ్వర్యంలో దంత పరీక్షలు



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజా దంత వైద్యశాల డాక్టర్ దిలీప్‌కుమార్‌రెడ్డి, ఇండోకో వారెన్ ఫార్మా టెరిటరీ మేనేజర్ దాసరి జయకుమార్ ఆధ్వర్యంలో నారాయణ స్కూల్ విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. గురువారం ద్వారక నగర్‌లోని నారాయణ స్కూల్‌లో 150 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. డాక్టర్ దిలీప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పళ్లు శుభ్రంగా తోముకోవాలని, పడుకునే ముందు చాక్లెట్, తదితర పదార్థాలు తినరాదన్నారు. ఉదయం రాత్రి రెండు పూట బ్రెస్ చేసుకోవడం మంచిదన్నారు. దంతాలు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి డైట్ పాటించాలని సూచించారు. పళ్లు ఎత్తు, వంకర్లు ఉంటే చిన్న వయసులోనే వాటిని సరి చేసుకోవచ్చన్నారు. పళ్ల సంరక్షణ కోసం జాగ్రత్తలు తీసుకుంటే జీవితాంతం ఎంతో పటుత్వంగా ఉంటాయని తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని వినతి

రాయదుర్గం : వీరాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయున్ని నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బంగి శివ ఉన్నతాధికారులకు గురువారం వినతిచేశారు. పాఠశాలలో ఖాళీగావున్న ప్రధానోపాధ్యాయుని పోస్టుకు వెంటనే తాత్కాలిక హెచ్ఎంను నియమించాలని కోరారు. ఇదివరకు హెచ్ఎంగా పనిచేస్తున్న బషీర్ అహ్మద్ మహిళా ఉపాధ్యాయులు, ఎండిఎం ఏజెన్సీ కార్మికులు, విద్యార్థుల తల్లిదండ్రుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారన్నారు. విద్యార్థులకు అందించాల్సిన చిక్కీలు, కోడిగుడ్లు, దుస్తులు, పుస్తకాలు సకాలంలో అందించకపోవడంతో మూడు రోజుల క్రితం జిల్లా విద్యాశాఖ అధికారులు ఆయనను సస్పెండ్ చేశారన్నారు. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడి పోస్టు ఖాళీగా ఉందన్నారు. దీంతో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ వారికి అందించాల్సిన సదుపాయాలు, రికార్డుల నిర్వహణ కష్టతరంగా మారిందన్నారు. ఇటీవల పాఠశాలలో పనిచేసే సీనియర్ ఉపాధ్యాయుడిని ఇన్‌ఛార్జి హెచ్ఎంగా నియమించాలని ఆర్జేడీ ఎంఈవోను ఆదేశించారన్నారు. అయితే ఎంఇఒ ఆర్జేడీ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇన్‌ఛార్జి హెచ్ఎంను నియమించకుండా విద్యార్థులు, ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖాధికారులు ఆర్జేడీ ఆదేశానుసారం ఇన్‌ఛార్జి హెచ్ఎంను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు.

ఆ వాహనాలను తుక్కు కింద అమ్ముకోవచ్చు..!

◆ బిఎస్-3 నుంచి బిఎస్-4 రిజిస్ట్రేషన్‌పై కోర్టు తీర్పు ◆ రెండు రోజుల్లో ఐదు వాహనాలు అమ్మకానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తప్పుడు పత్రాలతో బిఎస్-3 వాహనాలను బిఎస్-4గా రిజిస్ట్రేషన్ చేసిన కేసులోని ఐదు వాహనాలను తుక్కు కింద అమ్మకానికి న్యాయస్థానం అనుమతినిచ్చింది. ఈ వాహనాలను రెండు రోజుల్లో తక్కు కింద అమ్మకానికి రవాణ, పోలీసు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తుక్కు కింద కొన్న వాహనాలను బిఎస్-4గా రిజిస్ట్రేషన్ చేసారన్న ఆరోపణలపై గత కొంతకాలంగా రవాణా, పోలీసు శాఖ విచారణ చేపడుతున్న విషయం తెలిసిందే. ఇది జెసి.ప్రభాకర్‌రెడ్డి కుటుంబంతో లింకు ఉందన్న ప్రచారమూ సాగుతోంది. ఈ కేసులో మొత్తం 154 వాహనాలు ఉన్నట్టు గుర్తించారు. ఇందులో కొన్నింటిని సీజ్ చేశారు. తప్పుడు పత్రాలు సృష్టించి విచారణ చేపట్టారన్న దానిపై పోలీసు విచారణ సైతం నడుస్తోంది. ఇది పురోగతిలోనున్న సమయంలోనే కొంత మంది బాధితులు తమకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించారు. నేరుగా తాము పత్రాలను సృష్టించి వాహనాలు రిజిస్ట్రేషన్ చేయలేదని అంతక ముందు గోపాల్ అండ్‌కో సంస్థ చేసిందని న్యాయస్థానం ముందు వాదన పెట్టారు. ఇది తెలియక తాము కొనుగోలు చేసామని, పెద్దఎత్తున ఆర్థికంగా నష్టపోతున్నందున తమకు వాహనాలను ఇవ్వాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఇందుకు అనుకూలంగా మొదట తీర్పునిచ్చింది. ఆ వాహనాలను వారికే ఇవ్వాలని కోరింది. ఈ నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు బిఎస్-3 వాహనాలు బయట తిరగడానికి అనుమతిలేదని కౌంటర్ దాఖలు చేశారు. దీంతో న్యాయస్థానం నేరుగా ఇవ్వడానికి అనుమతి నిరాకరించింది. దీంతో కనీసం తుక్కు కింద అయినా అమ్ముకునే అవకాశం కల్పిస్తే తమకు కొంత వరకైన నష్టం తగ్గుతుందని అభ్యర్థించడంతో అందుకు కోర్టు అంగీకరించి, తుక్కు కింద అమ్మకోవచ్చునని తీర్పునిచ్చింది. అయితే అప్పటికే వాహనాలను పోలీసులకు విచారణ నిమిత్తం అప్పగించామని రవాణా శాఖ అధికారులు కోర్టుకు తెలిపారు. అయితే ఇద్దరూ కలిపి పోలీసు, రవాణా శాఖ అధికారులు కలిపి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కోర్టు ఆదేశించింది. రెండు మాసాల గడువును పెట్టింది. నేరుగా వాహనాలు ఇవ్వకుండా తుక్కుగా మార్చే ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డు చేయాలని ఆదేశించింది. ఈ రికార్డు మొత్తాన్ని సీల్డ్ కవరులో న్యాయస్థానాన్ని అందజేయాలని కూడా ఆ తీర్పులో పేర్కొంది. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన కేసులో విచారణకు అవసరమైన ఆధారాలను ముందుగానే విచారణాధికారి సేకరించి భద్రపరుచుకోవాలని కూడా ఆదేశించింది. ఈ తీర్పు వచ్చి ఇప్పటికి రెండు మాసాలు పూర్తికావస్తున్న నేపథ్యంలో రెండు, మూడు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఐదు వాహనాల్లో ఒకటి అనంతపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఉండగా, నాలుగు తాడిపత్రి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్నాయి.



నేటి నుంచి సత్యసాయి జయంతి ఉత్సవాలు

◆ ఏర్పాట్లపై అధికారులు, ట్రస్టు సభ్యుల ప్రత్యేక దృష్టి ◆ 22న డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి సత్యసాయిబాబా 97వ జయంతి ఉత్సవాలు శుక్రవారం నాడు వేణుగోపాల స్వామి రథోత్సవంతో ప్రారంభం కానున్నాయి. వేణుగోపాలస్వామి గుడి నుంచి గోపురం గేటు వరకు వేణుగోపాలుడు, సత్యసాయి చిత్రపటం, సీతారామ విగ్రహాలను రథంలో ఉంచి ఊరేగిస్తారు. రథం ముందు వివిధ వేషధారణలతో కళాకారులు పాల్గొంటారు. ట్రస్టు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, దేశ విదేశీ భక్తులు ఇందులో పాల్గొననున్నారు. 19, 20న ప్రశాంతి నిలయంలో వివిధ సాంస్కతిక కార్యక్రమాలు జరగనున్నాయి. 22న సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 41వ స్నాతకోత్యవం జరగనుంది. ఇందులో ఇస్రో ఛైర్మన్ పాల్గొంటారు. విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేస్తారు. 23న సత్యసాయి జయంతి వేడుకల సందర్భంగా స్వర్ణరథంలో సత్యసాయి చిత్రపటం ఊరేగింపు, సాయంత్రం జోల మహెూత్సవంతో పాటు సాంస్కతిక కార్యక్రమాలు ఉంటాయి. ప్రశాంతి నిలయంలో ఈ వేడుకలకు పాల్గొనే వేలాదిమంది భక్తులు పర్యాటకులకు ఉచిత భోజన ప్రసాదాలు ఈనెల 23 వరకు పంపిణీ చేయనున్నారు. 23వ తేదీన కేంద్ర టూరిజం శాఖ మంత్రి కిషన్ రెడ్డి పర్యటన ఉంటుంది. వీరితో పాటు ప్రముఖులు, రాజకీయ నేతలు పుట్టపర్తికి రానున్నారు. వేడుకలను విజయవంతం చేసేందుకు అధికారులు, ట్రస్టు తగిన ఏర్పాట్లు చేపట్టింది. ఇప్పటికే ప్రశాంతి నిలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.



ముస్తాబైన సత్యసాయి బాబా మహాసమాధి

ఉత్సవాలను జయప్రదం చేద్దాం : కలెక్టర్

ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు పుట్టపర్తిలో నిర్వహించే శ్రీ సత్యసాయి బాబా 97వ జయంతి వేడుకలను అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులకు సూచించారు. పుట్టపర్తి కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ రామకష్ణ ప్రసాద్, డీఆర్వో కొండయ్య, సంబంధం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి ప్రారంభం అయ్యి ఈ నెల 23వ తేదీన నిర్వహించే బాబా 97వ జయంతి వేడుకల సందర్భంగా అన్ని రకాల ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఉత్సవాలకు సంబంధించి కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పుట్టపర్తి పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పుట్టపర్తిలో పారిశుధ్య కార్యక్రమాలను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని, అవసరమైతే మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు, పర్యాటకుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. చిత్రావతి నది ప్రాంతంలో విద్యుత్ దీపాలంకరణ చేయాలన్నారు. పుట్టపర్తికి దగ్గరలోని పర్యాటక ప్రాంతాలను తెలియజేసే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం అధికారి జి.నాగేశ్వర్ రెడ్డి, ఎస్పీడీసీఎల్ ఎస్సీ ఇ.శర్వాన్, ఆర్టీసీ అధికారి టి.మధుసూదన్, పుడా వైస్ చైర్మన్ కె.నరేష్ కుమార్, ఆర్టీవో కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న మేయర్ వసీం

నగర మేయర్ మొహమ్మద్ వసీం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు తీసుకొచ్చిన సమస్యలకు తక్షణ పరిష్కారం చూపిస్తున్నట్లు నగర మేయర్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. నగరంలోని 38వ డివిజన్ పరిధిలో రూ.20 లక్షలు వ్యయంతో చేపడుతున్న పనులకు మేయర్ వసీం డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, విజయభాస్కర్ రెడ్డి లతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వైసిపి ఈ మూడేళ్ల పాలనలో 98 శాతం పైగా అమలుచేశామన్నారు. సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఆయా ఫలాలు అందుతున్న తీరును పరిశీలించేందుకై గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. నగరంలో అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రజలతో మమేకమై గడప గడపకూ కార్యక్రమం నిర్వహించడంతో పాటు స్థానికులు తీసుకొచ్చిన సమస్యలను సచివాలయంకు విడుదలైన రూ.20 లక్షలు వ్యయంతో అత్యవసర పనులకు తక్షణ పరిష్కారం చూపుతున్నారన్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పనులు వంటి ప్రజలు తీసుకొచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పనులను చేపడుతున్నట్లు మేయర్ పేర్కొన్నారు. మిగిలిన సమస్యలను కూడా ఇతర గ్రాంట్‌ల నుండి నిధులు మంజూరుచేసి పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ నాగమోహన్, వైసీపీ నాయకులు ఖాజా, మధు, చిన్ని, రమేష్, నాగరాజు, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ పివివిఎస్.మూర్తి, కమిషనర్ భాగ్యలక్ష్మి గురువారం పరిశీలించారు. డంపింగ్ యార్డులో వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ విధానం యూనిట్‌ను పరిశీలించారు. నేషనల్ దేశంలోని పలు నగర, పురపాలికల్లో చేపడుతున్న చెత్త నిర్వహణకు సంబంధించిన విషయాలు గ్రీన్ ట్రిబ్యునల్‌లో విచారణకు రావడంతో పలు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో వర్చ్యువల్ హియరింగ్ నిర్వహించారు. అన్ని మునిసిపాల్టీల అధికారులు వారి నగరాల్లో డంపింగ్ యార్డ్ నందు జరుగుతున్న వ్యర్థాల రీసైక్లింగ్ విధానం యూనిట్‌ను వీక్షించే ఏర్పాట్లు చేసియున్నారు. అనంతపురం డంపింగ్ యార్డులో కూడా ఇప్పటికే సిసి.కెమెరాలు ఏర్పాటు చేసి వ్యర్థాల నిర్వహణ పనులు కనిపించేవిధంగా తగు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, ఎంహెచ్‌ఒ గంగాధర్‌రెడ్డి, ఇంజినీర్ రామ్‌ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొనారు.

ఎస్ఎఫ్ఐ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-తాడిపత్రి

ఎస్ఎఫ్ఐ తాడిపత్రి మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గురువారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మండల మహాసభను నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు వరుణ్ అధ్యక్షతన జరిగిన మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శిగా వరుణ్, అధ్యక్షులుగా అరవింద్, సహాయ కార్యదర్శులుగా కళ్యాణ్, మస్తాన్, ఉపాధ్యక్షులుగా మణికంఠ, సందీప్, కమిటీ సభ్యులుగా నరసింహ, వర్ధన్, మల్లికార్జునలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు వరుణ్, అరవింద్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన బైజూస్ ఒప్పందాన్ని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దుచేయాలన్నారు. హాస్టళ్లలో సమస్యలు నెలకొన్నాయన్నారు. వీటన్నింటినీ పరిష్కరించే వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని వెల్లడించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

గుత్తి : నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యదర్శి సిహెచ్.శంకర్రావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ఎస్‌లో గురువారం ఆయన పర్యటించారు. పత్తికొండ రోడ్డు కూడలిలో న్న పూలే విగ్రహానికి ఆయన పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీ అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. యూనియన్ కార్యాలయం, లోకో డీజిల్ షెడ్‌ను ఆయన సందర్శించారు. కార్మికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు మహ్మద్ గౌస్, నారాయణ, మస్తాన్ వలీ, కోశాధికారి శర్మ, కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ రమేష్, గుత్తి బ్రాంచ్ కార్యదర్శులు రామంజులరెడ్డి, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సేవలు అభినందనీయం

ఉరవకొండ : సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల సేవలు అమోఘమని ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక లయన్స్ క్లబ్‌లో జర్నలిస్టులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం రావడానికి జర్నలిస్టుల కృషి మరువలేనిదన్నారు. పత్రికల ద్వారా జర్నలిస్టులు దేశ ప్రజలందరినీ చైతన్యపరచి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేలా చేశారని కొనియాడారు. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారదులుగా ఉండడమే కాకుండా ప్రపంచం నాలుగు దిక్కుల్లో జరిగే సంఘటనలను ప్రజల వద్దకు చేర్చడంలో ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అనంతరం జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ గణేష్ బాబు, ట్రెజరర్ నజీర్, సభ్యులు బాలచంద్ర, ప్రభాకర్ నాయుడు, జయకృష్ణ, సత్యన్న, ఎంసి నాగభూషణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు చైర్‌పర్సన్ భూమిపూజ

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో ఉన్న చెర్లోపల్లి కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులకు గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ డి.వన్నూర్ బీ భూమిపూజ చేశారు. కాలనీలో సిసి రహదారులు, తాగునీటి బోరు, మురుగు కాలువల నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో చేపట్టిన పనులకు ఆమె భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. 22 వార్డులో అభివృద్ధి పనులకు ఆమె భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బివి.నరసారెడ్డి, డిఈ ఇంతియాజ్, ఏఈ శరత్‌చంద్ర, కౌన్సిలర్ ఎం.సులోచన, వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పీరా, జిల్లా నాయకులు బేడల వెంకటరాముడు, ఎం.రంగస్వామి, నాయకులు వెంకటరాముడు, షఫీ, షరీఫ్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని గడేకల్ గ్రామం నుంచి ఎన్.తిమ్మాపురంకు వెళ్లే రోడ్డులో అడ్డంగా ఉన్న కంపచెట్లను గురువారం తొలగించారు. ఎన్.తిమ్మాపురం గ్రామ ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో విషయాన్ని వైస్ ఎంపీపీ కరణం పుష్పావతి భీమిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆమె సంబంధిత అధికారులకు ఆదేశించడంతో జెసిబి సహాయంతో రోడ్డులో గుంతలను పూడ్చి మట్టి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా పెరిగిన కంపచెట్లను తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుశీల ఉమాశంకర్, మాజీ సర్పంచులు కరణం భీమిరెడ్డి, మేకల పంపాపతి, వైసీపీ నాయకులు ఉమాశంకర్, రాము ధనుంజయరెడ్డి, దుగ్గేన్న, శివారెడ్డి, లాలప్ప తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

బుక్కరాయసముద్రం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అనంతపురం పరిశ్రమల కేంద్రం వారు మండలంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈనెల 19వ తేది 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. జిల్లాలోని వనరులు, నూతన పరిశ్రమలు స్థాపించుటకు ఉన్న అవకాశాలు, పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అనుమతులు, సబ్సిడీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు మొదలైన వివరాలను సదస్సులో వివరిస్తారని చెప్పారు. ఆసక్తి కలవారు ఈ అవగాహనా సదస్సుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయునికి ఘన సన్మానం

గుత్తి : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయి బాబును గ్రంథాలయ అధికారి హెచ్.రామాంజనేయులు సన్మానించారు. 55వ గ్రంథాలయాల వారోత్సవాలను పురస్కరించుకొని విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన కుళ్లాయి బాబుకు శాలువా కప్పి పూలమాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సెంటర్ తనిఖీ

అనంతపురం : స్థానిక బీసీ కాలనీలోని రెండవ అంగన్వాడీ కేంద్రాన్ని సర్పంచి ఎగిరి వరలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. పిల్లల హాజరు శాతం, గర్భిణులు, బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. మూడేళ్లలోపు బాలబాలికలకు బాలామృతం పాకెట్లు, గుడ్లు, పాల ప్యాకెట్లు పిల్లల తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల విజేత భూమా సాయిశ్రీ

శింగనమల : చైల్డ్ లైన్ సే దోస్తి బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా శింగనమల ఉన్నత పాఠశాలలో చైల్డ్ లైన్, ఐడిఇఎహెచ్ సంస్థలు సంయుక్తంగా బాలబాలికలకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో శింగనమల జెడ్‌పిహెచ్ స్కూలు ఏడవ తరగతి విద్యార్థిని భూమా సాయిశ్రీ మొదటి బహుమతిని సొంతం చేసుకుంది. తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపిడిఒ నిర్మలాకుమారి చేతుల మీదుగా సాయిశ్రీ గురువారం బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు భూమా సాయిశ్రీని అభినందించారు.

కాటికాపర్ల సమస్యలను పరిష్కరించండి

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-గుత్తి

మృతదేహాలకు గుంతలు తీసే కాటికాపర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కులవివక్ష పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. పట్టణంలోని జడ్.వీరారెడ్డి భవనంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల కార్యదర్శి ఉరుముల మల్లికార్జున అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప హాజరై మాట్లాడారు. సభ్య సమాజంలో అణగారిన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యల పరిష్కారానికై దళిత, గిరిజనులు ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, అంటరానితనం, అస్పృశ్యతలకు వ్యతిరేకంగా స్థాపన ఆత్మగౌరవం, సమానత్వం కులనిర్మూలన లక్ష్యంగా 1998 అక్టోబర్ 2న కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ ఆవిర్భవించిందన్నారు. కెవిపిఎస్ ఆవిర్భావం నుంచి దళితులు, గిరిజనులకు అండగా పోరాటం చేస్తోందన్నారు. అనాది కాలం నుండి పట్టణ, పల్లె ప్రాంతాల్లో శ్మశానంలో గుంతలుతీసే కాటికాపర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుత్తి మండలంలోని గ్రామాల్లో శ్మశాన వాటికల్లో సమస్యలు నెలకొన్నాయని చెప్పారు. శ్మశాన వాటికల్లో కంపచెట్లు పెరిగి పూడ్చడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాటికాపర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కాటికాపర్లకు ప్రత్యేక పెన్షన్, ప్రమాద బీమా ప్రత్యేకంగా రూ.10 లక్షలు చెల్లించాలన్నారు, ఇంటి నిర్మాణం కోసం రెండు సెంట్ల స్థలం, మూడు ఎకరాల సాగు భూమి ప్రతి కుటుంబానికి ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్మికులుగా గుర్తించి గడ్డపార, పారగంపలు ఉచితంగా ఇవ్వాలని కోరారు. అనంతరం కెవిపిఎస్ మండల అధ్యక్షులుగా రంజిత నాయక్, ప్రధాన కార్యదర్శిగా యు.మల్లికార్జున, సహాయ కార్యదర్శి రాజులు ఎన్నికయ్యారు. కాటికాపర్ల మండల నూతన సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఖాసీం, కార్యదర్శిగా వెంకటేష్, ఉపాధ్యక్షులుగా శివరాజ్, పెద్దిరాజ్, మల్లికార్జున, సహాయ కార్యదర్శులుగా నాగార్జున, గంగాధర్, రాజు లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి వి.నిర్మల, రైతు సంఘం నాయకులు బి.రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుకమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ఘనంగా సహకార వారోత్సవాలు



మాట్లాడుతున్న ఎడిసిసి బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత

ప్రజాశక్తి-అనంతపురం

అఖిలభారత సహకార వారోత్సవాలను 4వ రోజు రాయల సీమ సహకార శిక్షణ సంస్థలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎడిసిసి బ్యాంకు చైర్ పర్సన్ లిఖిత మాట్లాడుతూ.. మాజీ సిఎం రాజశేఖర్‌రెడ్డి సహకార బ్యాంకులకు షేరు ధనం ఇచ్చి నష్టాల్లో చాల కృషిచేశారన్నారు. సిఎం జగన్మోషన్‌రెడ్డి సహకార బ్యాంకులు, సంఘాల అభివృద్ధికి పటిష్టమైన చర్యలు చేపట్టారని తెలిపారు. సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి తమ సంస్థల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. బ్యాంకు జనరల్ మేనేజరు సురేఖరాణి మాట్లాడుతూ.. సకార సంఘాలు అతి త్వరలో కంప్యూటరైజేషన్ పూర్తి గావించుకొని రైతులకు పారదర్శక సేవలు అందచేస్తాయని తెలిపారు. బ్యాంకు అందిస్తున్న వివిధరకాలైన సేవల గురించి తెలియజేశారు. జిల్లా సహకార అధికారి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సహకార బ్యాంకులు, కూడా వాణిజ్య బ్యాంకులకు ధీటుగా అన్ని రకాలైన సేవలు అందిస్తున్నాయని, వాటిని ఖతాదారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ రాఘవరెడ్డి మాట్లాడుతూ... సిఎం జగన్మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని వారికి సకాలంలో రావలసిన వడ్డీ రాయితీలు ఇతర ప్రోత్సాహకాలు సహకార బ్యాంకులు, సంఘల ద్వారా ఎప్పటికప్పుడు వారి ఖాతాల్లో జమ అయ్యేలా సత్వర చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్ర సహకార యూనియన్ మేనేజింగ్ డైరెక్టరు అలీ అక్బర్ మాట్లాడుతూ... సహకార బ్యాంకులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇనుమడింపజేసుకొని ఖతాదారులకు పారదర్శక సేవలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. ఎడిసిసి బ్యాంకు విశ్రాంత సిఇఒ తీయులేటి నరసింహారెడ్డి, ఆర్‌సి టిసి మాజీ ప్రిన్సిపల్ సురేందర్‌రెడ్డి, ఇందిరాదేవి సహకార వారోత్సవాల విశిష్టత గురించి తెలియ చేశారు. ఆర్‌సిటిసి ప్రిన్సిపల్ శ్రీనివాసులు వందన సమర్పణ గావించారు. కార్యక్రమంలో ఎడిసిసి చినుకు సిబ్బంది, సహకార శాఖ సిబ్బంది, శిక్షణ సంస్థ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు పవర్ కట్

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల క్రితం 15వ ఆర్థిక సంఘం నిధులను కొంచెం పంచాయతీలకు విడుదల చేశారు. సర్పంచులు ఎన్నికైనప్పటి నుండి పంచాయతీ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం ఇదే ప్రథమం. ఇన్ని రోజులుగా అప్పులు చేస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేసిన సర్పంచులకు కొంచెం ఊరట కలిగింది. ఇంతలోనే మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు విద్యుత్ బిల్లులను ఈ నిధుల నుంచే చెల్లించాలని, గ్రీన్ అంబాసిడర్‌లకు కూడా ఈ నిధుల నుండే వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేయడంతో సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కసాపురం గ్రామంలో గురువారం విద్యుత్ బిల్లులో బకాయిలు దాదాపు రూ.85 లక్షలు మేర ఉన్నాయి. ఇందులో సగం 15 ఆర్థిక సంఘం నిధుల నుండి చెల్లించాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదని పంచాయతీ కార్యాలయానికి విద్యుత్ కనెక్షన్ తొలగించారు. రూ.లక్షలు అప్పులు చేసి పంచాయతీ అవసరాలు తీర్చామని ఇప్పటి కూడా ఇచ్చిన నిధుల నుండే ఇతర ఖర్చులకు వాడాలని జీవోలు జారీ చేస్తే గ్రామ అవసరాలు ఏ విధంగా తీర్చాలని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు పేరెంట్స్ కమిటీలకు అప్పజెప్పాలి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు -నేడు పథకంలో భాగంగా పాఠశాలలకు మంజూరయ్యే నిధులను పేరెంట్స్ కమిటీలకు అప్పగించాలని కురుబ సాధికారక సమితి రాష్ట్ర డైరెక్టర్ నారాయణస్వామి డిమాండ్ చేశారు. పాఠశాలల్లో మౌలికసదుపాయాలు, అదనపు తరగతి గదుల కోసం రూ.వేల కోట్లు కేటాయించామని ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తోందన్నారు. వాటిని ఎక్కడ ఉపయోగించారో అంతుబట్టడంలేదన్నారు. ఈ ఫండ్స్‌ను వినియోగించే అధికారం స్కూల్ పేరెంట్స్ కమిటీలకు అప్పగించాలన్నారు. పర్యవేక్షణ అధికారం ప్రభుత్వ సంబంధిత అధికారులు చూసుకునేలా చేయాలని డిమాండ్ చేశారు. స్కూల్స్, కాలేజీలలో టాయిలెట్స్ మెయింటెనెన్సు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 47 వేల మంది అయాలను నియమించుకుని వారికి ఒక్కొరికి రూ.6 వేలు గౌరవ వేతనం అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతోందన్నారు. అయితే వారు ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఆ నిధులు ఎక్కడ పోతున్నాయో ప్రభుత్వం చెప్పాలన్నారు. ఐఎంఎంఎస్ మొబైల్ అప్లికేషన్ ద్వారా వీటిపైన పర్యవేక్షణ నామమాత్రంగానే జరుగుతోందన్నారు. వీటన్నింటిపైనా విద్యాశాఖ అధికారులు శ్రద్ధ పెట్టాలని సూచించారు.

గృహ నిర్మాణంలో ఏపీ దేశానికే ఆదర్శం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

వైఎస్సార్ జగనన్న కాలనీలలో లక్షలాది ఇళ్ల నిర్మాణంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం బూదగవి గ్రామంలో రెండవ రోజు నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వారు పొందుతున్న లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని సిఎం జగన్మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతీ సంక్షేమ పథకం అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం లాగా ప్రజలను మోసం చేయకుండా ఇసుక, సిమెంటు, బిల్లులను సకాలంలో అందిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం జరగకుండా మహిళా సంఘాల ద్వారా రుణాలు కూడా ఇప్పిస్తున్నామన్నారు. సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ పనితీరు బాగుందని అన్ని రాష్ట్రాలూ భేష్ అని అభినందనలు తెలియ జేస్తున్నాయని అన్నారు. ఇంతటి సుపరిపాలన గతంలో ఏ ప్రభుత్వం అందించలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బూదగవి గ్రామ సర్పంచి లక్ష్మీదేవి, జెడ్పిటిసి ఏసీ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుంకన్న, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, పిఎసిఎస్ ఛైర్మన్లు శ్రీరాములు, తేజోనాథ్, నాయకులు బ్యాంకు ఓబులేసు, ఆశోక్ కుమార్, జెడ్పిటిసి తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

నార్పల : గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బండ్లపల్లి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి గురువారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డి, ఎంఐఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్, మండల కన్వీనర్ నిట్టూరు రఘునాథరెడ్డి, జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరరావు, సింగిల్‌విండో ఛైర్మన్ లోకనాథ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ దిద్దుకుంట కేశవరెడ్డి, మండల వ్యవసాయ కమిటీ ఛైర్మన్ నాగలింగారెడ్డి, తహశీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీవో దివాకర్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహ, వ్యవసాయ అధికారి ముస్తఫా, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల సేవలు ఆదర్శం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజంలో గ్రంథాలయాల ద్వారా అందుతున్న విద్యా చైతన్యం, సంకల్పం లక్ష సాధన వేదికగా నిలిచి అందిస్తున్న సేవలు ఆదర్శంగా నిలిచాయని, వాటిని మనమందరం సద్వినియోగం చేసుకుందామని రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ చామలూరు హరిత రాజగోపాల్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నాల్గవ రోజుకు చేరుకున్నాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, కార్యదర్శి పి.రమ ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాలకు రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వారితో పాటు వైఎస్ఆర్‌సిపి నాయకులు ఎల్ఎం.మోహన్‌రెడ్డి, రచయితలు అమర్‌నాథ్‌రెడ్డి, ప్రభాకర్, షేక్ రియాజుద్దీన్, అనంతయ్య హాజరై గ్రంథాలయాల సేవలను కొనియాడారు. సాయంత్రం నిర్వహించిన కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ సుబ్బరత్నమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : తాడిపత్రి శాఖా గ్రంథాలయాధికారి బి.రవికుమార్ నాయుడు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గ్రంథాలయాలపై గురువారం అవగాహన కల్పించారు. పుస్తకం విలువ, ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం పుస్తకం పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్లు పి.శ్రీధర్‌రెడ్డి, ఎస్.రామాంజనేయులు, లైబ్రేరియన్ డి.మౌలాలి, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

పుట్లూరు : గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాల, జెడ్‌పి హైస్కూల్, మోడల్ స్కూల్ విద్యార్థులకు గ్రంథాలయాలు-వాటి ఆవశ్యకత అనే అంశంపై గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి ఎస్. జయరాములు తెలిపారు.



అనంతపురంలో పుస్తకాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గం : జాతీయ గ్రంథాలయ వారోత్సవాను పురస్కరించుకుని రాయదుర్గం శాఖా గ్రంథాలయంలో హైస్కూలు విద్యార్థులకు గురువారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్టాలిన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రంథాలయ అధికారిణి ఆదిలక్ష్మి ఈ పోటీలను పర్యవేక్షించారు. విశ్రాంత ఉపాధ్యాయులు బద్రీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఈకేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి-గుత్తి

నాలుగో విడత విద్యా దీవెన, వసతి దీవెన పథకాల నిధుల కోసం విద్యార్థులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సహాయ సాంఘిక సంక్షేమ అధికారిణి బి.రాధిక సూచించారు. గురువారం ఆమె గుంతకల్లు నియోజకవర్గంలోని కళాశాలలు, గ్రామ, వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి తల్లి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ నెంబర్‌తో సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. విద్యార్థుల తల్లులకు ప్రభుత్వం నుంచి విద్యా దీవెన, వసతి దీవెన పథకాల సంబంధించిన నిధులు విడుదల అనంతరం విధిగా కళాశాలలకు చెల్లించాలని కోరారు. అనంతరం ఎఎస్‌డబ్ల్యూఒ కార్యాలయంలో విద్యా, సంక్షేమ సహాయకులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఒలు ఆదినారాయణ, సంజీవ రాయుడు, ఎల్‌డిసి రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో లేని పశువుల మందులు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మండలంలో పశువులకు బొబ్బర్ల వ్యాధి ప్రబలిపోతోంది. సకాలంలో చికిత్స అందక పదుల కొద్దీ పశువులు ప్రాణాలు కోల్పోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి పశువుల కోసం సంచార వైద్యశాలలు, అంబులెన్స్ ఏర్పాటు చేసింది. ప్రస్తుత సీజన్లో పశువులకు బొబ్బర్ల వ్యాధి సోకి మరణించడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగి మనోవేదనకు గురవుతున్నారు. సంచార వైద్యశాల ద్వారా వ్యాధి సేవకుల పశువులకు కేవలం ఒక డోసు మాత్రమే వేస్తున్నారు. మిగిలినా తమ దగ్గర స్టాకు లేదని మందులు మార్కెట్లో తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. మార్కెట్లో కొనుగోలు చేయడానికి ఈ మందులకు రూ.వేలు ఖర్చు చేయలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పశుసంపద రోజురోజుకు తగ్గిపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం వ్యాధి తీవ్రతను గుర్తించి బొబ్బర్ల వ్యాధికి తగినంత మందులు అందుబాటులోకి తీసుకురావాల్సిందిగా రైతులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

210 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని కరిడికొండ గ్రామంలో గురువారం సాయంత్రం అక్రమంగా నిలువవుంచిన స్టోర్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించేందుకు గ్రామంలోని మారెమ్మ గుడి వద్ద 210 బస్తాల ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారు. సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. బియ్యం బస్తాలతో పాటు ఆటోను స్వాధీనం చేసుకుని సిఎస్ డీటీ ఎం.కంబక్కకు అందజేశారు. గ్రామానికి చెందిన పి.నరేష్, పి.మహేష్‌బాబు, మల్లయ్యలపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

విషాదాన్ని మిగిల్చిన రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్



పాడె మోస్తున్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

వైసిపికి చెందిన ఇరువురు బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కుటుంబ సభ్యుల రోధనలతో ఆ పార్టీ శ్రేణులు శోకసంద్రంలో మునిగిపోయారు. రాయదుర్గం మండల వైస్ ఎంపీపీ కావలి సత్యనారాయణ నాయుడు (42), మల్కాపురంకు చెందిన మంజునాథ్ మోటార్ సైకిల్‌పై వెళ్తూ గుమ్మగట్ట మండలం దేవిరెడ్డిపల్లి గేటు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఏదైనా వాహనం ఢీకొనిందా, అదుపుతప్పి మోటార్ సైకిల్ పైనుంచి పడ్డారా అనే విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే మల్కాపురం చెందిన మంజునాథ్ అక్కడికక్కడే మతిచెందగా, సత్తి కొనఊపిరితో ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. 108కు సమాచారం అందించిన 45 నిమిషాల పాటు వేచి చూసినప్పటికీ అంబులెన్స్ రాలేదని సంఘటనా స్థలంలో ఉన్న వ్యక్తులు చెప్పారు. వైస్ ఎంపీపీ సత్తిని గుర్తించి రహదారిపై వెళ్తున్న వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రులను రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సత్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు సత్తికి భార్య శాలిని కుమార్తె, కుమారుడు ఉన్నారు. మల్కాపురం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త మంజునాథ్ (36) మృతి చెందడంతో ఆ గ్రామంలోనూ విషాదఛాయలు అలముకున్నాయి. మృతునికి భార్య రాజమ్మ, కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేందర్‌రెడ్డి, ఎంపీడీవో కొండయ్య, ఇఒఆర్‌డి రఘురాంరావు, పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు కాశీపురం, మల్కాపురం గ్రామాల్లో మృతులకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-పుట్లూరు

అరకటవేముల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యంలో గ్రామస్తులు సచివాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ.. నాలుగు రోజులుగా తాగునీరు లేక అరకటవేముల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతోందన్నారు. శ్మశానానికి వెళ్లేదారిలో కంపచెట్లు పెరగడంతో మృతదేహాలను తీసుకెళ్లేందుకు గ్రామస్తులు ఇబ్బదులు పడుతున్నారని తెలిపారు. వెంటనే కంపచెట్లను తొలగించాలన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోతామన్నారు. తహశీల్దారు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పెద్దకొండయ్య, బాలకొండయ్య, శేఖర్, ఆదెన్న, లక్ష్మీదేవి, రామలక్ష్మి, రత్నమ్మ, పెద్ద ఓబులమ్మ, గంగమ్మ, మల్లీశ్వరి, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఉన్నత విద్యా నియంత్రణ పర్యవేక్షణ కమిషన్ చైర్మన్‌ను కలిసిన గేట్స్ కరస్పాండెంట్



అభినందనలు తెలుపుతున్న వికె.పద్మావతమ్మ

గుత్తి : ఏపీ ఉన్నత విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఛైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి మఠం వెంకటరమణను గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ గురువారం కలిశారు. పర్యవేక్షణ కమిషన్ ఛైర్మన్ వెంకటరమణ గుత్తివాసి కావటంతో విజయవాడలో ఉన్న ఆయన్ను వికె. పద్మావతమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

'జీతాలు ఇవ్వలేదని చెప్పలేదు'..

ప్రజాశక్తి-ఉరవకొండ

జీతాలు ఇవ్వలేదని తాము ఎవరితో చెప్పలేదని విడపనకల్ ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు పేర్కొన్నారు. గురువారం విడపనకల్ మండల కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్లు బిల్లులు మంజూరులో జాప్యం అయినప్పటికీ తమను ఇబ్బందులకు గురిచేయకుండా వీలైనంత తొందరలో జీతాలు పంపిణీ చేస్తున్నారన్నారు. టెక్నికల్ సమస్యల వల్ల మండల వ్యాప్తంగా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు వచ్చినా సంబంధిత అధికారుల సహకారంతో ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. అనవసరంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కాంట్రాక్టర్లు, కార్మికులకు మనస్పర్ధలు వచ్చే విధంగా వ్యవహరించడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు వీరన్న, శంకరయ్య, లక్ష్మన్న, వన్నూరు స్వామి, శివ, బాలప్ప, సూరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ సమావేశానికి దేగల కృష్ణమూర్తి హాజరు

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవి.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన చాంబర్ మీటింగ్‌కు పంచాయతీరాజ్ చాంబర్ మెంబర్ దేగల కృష్ణమూర్తి హాజరయ్యారు. 18, 19 తేదీల్లో రెండు రోజులు బాలోత్సవ భవన్ లో జరిగే కార్యక్రమంలో 14, 15 ఆర్థిక సంఘం నిధులపై సర్పంచుల కీలక సమావేశం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి బీరు ప్రతాపరెడ్డి, ఉపాధ్యక్షులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, ఛాంబర్ మెంబర్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు

పాత్రికేయుని వైద్య ఖర్చులకు 'ఆలం' చేయూత

ప్రజాశక్తి-నార్పల

గుండెపోటుకు గురైన కూరగానపల్లి గ్రామానికి చెందిన ఎంఆర్ 9 పాత్రికేయుడు శ్రీనివాసరెడ్డి వైద్యానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు చేయూతనందించారు. అనంతపురంలోని పావణి హాస్పిటల్ యాజమాన్యం, వైద్య బృందంతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలందించాలని కోరారు. ఆరోగ్యశ్రీ వర్తింపజేసేలా ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడారు. తాము అండగా ఉంటామని శ్రీనివాసరెడ్డి కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కిమ్స్ సవీరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గడ్డంనాగేపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు రమేష్‌ని పరామర్శించారు. తాము అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.